సా..గుతున్న డబుల్ రోడ్డు పనులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా ఉన్న రోడ్డు



కామారెడ్డి–ముత్యంపేట రోడ్డులో కల్వర్టు వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు

దోమకొండ: మండలంలోని కామారెడ్డి–ముత్యంపేట రోడ్డుపై నిర్మిస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమకొండ నుంచి ముత్యంపేట మీదుగా కామారెడ్డి వరకు గతంలో సింగిల్‌రోడ్డు ఉండగా దానిని డబుల్‌రోడ్డుగా మారుస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నాటి ప్రభుత్వవిప్ గంపగోవర్దన్ పనులను ప్రారంభించారు. సింగిల్‌రోడ్డుగా ఉన్న బీటీని తొలగించి డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. కానీ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పనులు పూర్తికాక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ముత్యంపేట మీదుగా కామారెడ్డికి వెళ్లడానికి దూరం తగ్గుతుంది. దీంతో కొంత కాలంగా దోమకొండతో పాటు బీబీపేట ప్రాంతానికి చెందిన మండలాల ప్రజలు ముత్యంపేట నుంచి కామారెడ్డికి దూరం తగ్గుతుందని వెళ్తుంటారు. ప్రతినిత్యం వందలాది వాహనాలు ఈ దారివెంట ప్రయాణం సాగిస్తారు. గతేడాది ప్లాన్ వర్క్ కింద రూ.20 కోట్లతో పనులను ప్రారంభించారు. కామారెడ్డి మండలం క్యాంపసంపల్లి నుంచి దోమకొండ మండలం ముత్యంపేట మీదుగా దోమకొండ, గొట్టిముకుల గ్రామాల మీదుగా భిక్కనూరు మండలం జాతీయ రహదారిని కలుపుతూ డబుల్‌రోడ్డు పనులు చేపట్టారు. ఆయా గ్రామాల పరిధిలో ముందుగా కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టారు. కల్వర్టుల నిర్మాణం పూర్తికాక పక్కనుంచి దారిని వేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మరమ్మతులు జరుగుతున్న రోడ్ల వద్ద బురదమయంగా మారింది. జిల్లా అధికారులు వెంటనే స్పందించి పనులు తొందరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులను పూర్తి చేయాలి



డబుల్ రోడ్డుగా చేపట్టిన పను లు త్వరగా పూర్తి చేయాలి. వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టుల వద్ద పనులు పూర్తికాక వ్యవసాయ బావుల వద్ద నుంచి బురదమయంగా ఉన్న రోడ్లతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– అంజయ్య, ముత్యంపేట

త్వరలో పూర్తిచేస్తాం

డబ్బుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తాం. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పనులను కూడా పర్యవేక్షిస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ, కామారెడ్డి

పంచాయతీ కార్యదర్శిపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్పీవో నాగరాజు

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ పంచాయతీలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై బాన్సువాడ డీఎల్పీవో నాగరాజు శనివారం విచారణ చేపట్టారు. ఇళ్ల మార్పిడి, వివాహ ధ్రువీకరణపత్రాల మంజూరులో శ్రీనివాస్ అక్రమంగా డబ్బులు వసూలు చేశాడని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం డీఎల్పీవో గ్రామస్తులతో విచారణ చేపట్టారు. ఇళ్ల మార్పిడి, మ్యూటేషన్ కోసం ఒక్కొక్కరు రూ. 10 వేల వరకు ఇచ్చామని డీఎల్పీవోకు గ్రామస్తులు చెప్పారు. అంతేకాకుండా వివాహ ధ్రువీకరణ పత్రం కోసం కార్యదర్శి రూ. 5 వేలు తీసుకున్నాడని, దళిత బంధు పథకంలో షెడ్ల నిర్మాణానికి నిధులు నొక్కేసినట్లు పలువురు ఆరోపించారు. విచారణలో వచ్చిన స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకొని జిల్లా అధికారులకు నివేదిస్తామని డీఎల్పీవో గ్రామస్తులకు వివరించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారిణి అనిత, ప్రస్తుత జీపీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరసన



కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చేపడుతున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరసన శనివారం 11వ రోజుకు చేరింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. సమ్మె నోటీస్ ఇచ్చి 20 రోజులు, నిరసన చేపట్టి 11 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 2 నుంచి విధులను బహిష్కరించి ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు మహేశ్, గంగాధర్, అంజయ్య, నిర్మల పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలపై నిరంతరం ఉద్యమం



బాన్సువాడలో మాట్లాడుతున్న గంగాధర్ చారి

బాన్సువాడ: వికలాంగుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు గంగాధర్ చారి అన్నారు. బాన్సువాడలో జిల్లా నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. వికలాంగుల సమస్యలపై ప్రతీ రోజు ఉద్యమాలు చేస్తామని అన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రవీందర్, జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌చారి, సలహాదారుడిగా గంగాధర్ యాదవ్, ఉపాధ్యక్షులుగా గంగాబోయి నారాయణ, సంగీత, వెంకట్‌రెడ్డి, గంగారాం, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, సహాయ కార్యదర్శులుగా సంగప్ప, సంగ్రాం, బాబు, గంగారాం, కమిటీ సభ్యులుగా దత్తు, కృష్ణ, సాగర్, గంగాసాయిలు ఎన్నికయ్యారు.

పౌష్టికాహారం అందించాలి

నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లలు ఎదుగుదలను పరిశీలిస్తూ రిజిష్టర్లల్లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు వజ్ర, రమ, కమల, సరస్వతి, గంగామణి తదితరులు ఉన్నారు.

వలంటీర్లకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకుంటున్న వలంటీర్లు

బాన్సువాడ: కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లకు బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. తెలంగాణ హై కోర్టు లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రతి మండలం నుంచి సామాజిక, స్వచ్ఛంద సేవ, రిటైర్డ్ ఉద్యోగులను వలంటీర్లుగా నియమించారు. గ్రామాల్లో కేసు, తగాదాలు, సమస్యల పరిష్కారానికి వలంటీర్లు మధ్యవర్తిత్వంగా వ్యవరిస్తారు. అందులో భాగంగా ఈ వలంటీర్లకు మూడు రోజుల పాటు నిజామాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లకు సర్టిఫికేట్లు అందజేశారు. సర్టిఫికేట్లను స్థానిక సీఐ చేతుల మీదుగా అందుకున్నారు. వలంటీర్లు మాట్లాడుతూ.. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. వలంటీర్లుగా అయ్యాల సంతోష్, అహ్మద్ హుస్సేన్, రామకృష్ణారెడ్డి, నాగులగామ సాయిబాబా, పుష్పలత ఉన్నారు.

పాఠశాల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంపీవో ప్రకాశ్ శనివారం పరిశీలించారు. విద్యార్థులకు సరైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు నౌష్య, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి: హైదరాబాద్‌లో ఈ నెల 4న నిర్వహించే సగర ఉప్పర సంఘం రాష్ట్రసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి హన్మాండ్లు కోరారు. ఎల్లారెడ్డిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన రాష్ట్ర సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నాయకులు



బాన్సువాడ రూరల్: బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కిరణ్మయిని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పాత బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్, నాయకులు లాయఖ్, నవీన్‌రెడ్డి, యూనుస్, రహీం తదితరులు ఉన్నారు.

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి

బీబీపేట: ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం బీబీపేట్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శిస్తూ సమస్యలను సేకరించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, లింగం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెంగారంలో వైద్య శిబిరం

లింగంపేట: మండలంలోని మెంగారం జీపీలో శనివారం రెండో రోజు వైద్య శిబిరం నిర్వహించినట్లు లింగంపేట పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు తెలిపారు. శిబిరంలో 45 మందిని పరీక్షించగా నలుగురికి వైద్య పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. సీహెచ్‌వో ఠాగూర్, సూపర్‌వైజర్ ఫరీదా, యాదగిరి, రాంరెడ్డి, లక్ష్మణ్, రాజమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే అందరికీ ఆదర్శం

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



గోజేగావ్‌లో అన్నా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): అన్నాభావుసాఠే ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని గోజేగావ్, కుర్లా, డోంగ్లి మండలంలోని సిర్పూర్‌లో అన్నాభావుసాఠే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఎగురవేసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డోంగ్లి మండలంలోని సిర్పూర్‌లో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



లింగంపల్లిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

లింగంపేట: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. మండలంలోని లింగంపల్లి(ఖుర్దు)లో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. మురికి కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తీత, పిచ్చి మొక్కలను కార్మికులచే తీయించారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విషజ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో మలహరి, హెచ్ఎం రవీందర్‌శర్మ, సిబ్బంది ఉన్నారు.

రైతుల వివరాల సేకరణ



మెంగారంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

లింగంపేట/ భిక్కనూరు/ రాజంపేట/ సదాశివనగర్: రైతు రుణమాఫీ కానీ రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా సేకరిస్తున్నారు. లింగంపేట మండలంలోని మెంగారం, శెట్పల్లి, అయ్యపల్లి తదితర గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ శనివారం రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఏఈవోలు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డిలో రైతుల కుటుంబాలకు సంబంధించిన సర్వేను వ్యవసాయాధికారి రాధారెడ్డి ఏఈవో లత నిర్వహించారు. రైతుల కుటుంబాలకు సంబంధించిన రుణం, ఆధార్‌కార్డు వివరాలను ఎస్‌కేఎస్ ఫారం వివరాలను నమోదు చేసుకుని వారితో సెల్ఫీలు దిగారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ రాజంపేట మండలంలో కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయాధికారిణి సునీతరాణి తెలిపారు. కొండాపూర్ క్లస్టర్ పరిధిలోని రైతుల వివరాలను ఆన్‌లైన్ పొందుపరిచినట్లు పేర్కొన్నారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్, తిర్మన్‌పల్లిలో గ్రామ రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, ఏఈవోలు కవిత, శ్రీనివాస్ నాయక్ సేకరించారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతి



దోమకొండ: భిక్కనూరు మండలం బీటీఎస్ వద్ద జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ దోమకొండ మాజీ జెడ్పీటీసీ తిరుమల గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేణి నరసయ్య రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్‌కు వినతిపత్రం శనివారం అందజేశారు. బ్రిడ్జి లేకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దోమకొండ, బీబీపేట మండలాల ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

నియామకం



కామారెడ్డి రూరల్: ఓబీసీ మోర్చా విశ్వకర్మ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన తిప్పర్తి సతీశ్‌చారి నియామకం అయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర విశ్వకర్మ సెల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. అనంతరం నియమకపత్రాన్ని స్టేట్ కన్వీనర్ పూసల బ్రహ్మచారి, కో కన్వీనర్లు కొంపోజు గోవర్దన్ చారి, రాష్ట్ర యువజన కన్వీనర్ శ్రీపాద నరేశ్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఆధ్యాత్మికం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు ఆలయాలు చివరి శ్రావణ మాస శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న హనుమాన్, శివాలయాల్లో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. లింగంపేట మండలంలోని కొండాపూర్, లింగంపేట, పలు గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని సర్వాపూర్ హనుమాన్ మందిరంలో, బీర్కూర్ మండలం బైరాపూర్‌లోని లక్ష్మీవిఠలేశ్వర మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి క్షేత్రం నిర్వాహకుడు పట్లోళ్ల కిశోర్‌కుమార్ మహాపాదయాత్ర చేపట్టారు. బ్రాహ్మణపల్లి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అంజనాద్రి క్షేత్రం చేరుకున్న పాదయాత్ర అంజనాద్రుడికి అభిషేకం, అర్చనలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో ఉన్న ధాసాంజనేయస్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి ఆలయంలో భజన కీర్తనలు చేశారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠాపన

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జయప్రదీప్, ప్రజా పండరి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట: మండలంలోని జప్తిజాన్కంపల్లిలో ఉన్న గంగమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పురోహితులు శివకుమార్ శర్మ సమక్షంలో ముదిరాజ్ సభ్యులు యజ్ఞంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

క్లుప్తంగా

వార్డుల వారీగా ఓటర్లను నమోదు చేయాలి



బీబీపేట: రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలో వార్డుల వారీగా ఓటర్లను నమోదు చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కుటుంబ సభ్యులు వేర్వేరు వార్డుల్లో ఓటర్లుగా నమోదు అయినవారిని గుర్తించి వారిని ఒకే వార్డులో వచ్చే విధంగా మార్పులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ తదితరులు ఉన్నారు.

వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టాలి

దోమకొండ: రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలకు, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉమ్మడి దోమకొండ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ నాగభూషణం, జిల్లా కార్యదర్శి సీహెచ్ లింగం, నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం



బీబీపేట: మూడో విడత సామాజిక తనిఖీ నేటి నుంచి ప్రారంభమైందని, అన్ని గ్రామాల్లో తనిఖీలు జరుగుతున్నాయని డీపీవో శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ఇప్పటికే ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు వెళ్లారని ప్రతి రోజులు ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఈ నెల 4న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మీసానిపల్లిలో న్యాయచైతన్య సదస్సు



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మీసానిపల్లిలో శనివారం ఎల్లారెడ్డి మున్సిఫ్‌కోర్టు ఆధ్వర్యంలో న్యాయచైతన్య సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి హారిక మాట్లాడుతూ.. మహిళలకు చట్టం ద్వారా ఎంతో రక్షణ లభిస్తుందన్నారు. గృహహింసకు గురవుతున్న మహిళలు వారికి సమీపంలోని అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, సీడీపీవో సరిత, ఏపీఎం ప్రసన్నరాణి, సఖి కేంద్రం సిబ్బంది భారతి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



సదాశివనగర్: మండలంలోని మర్కల్, తిర్మన్‌పల్లి గ్రామాల మీదుగా అక్రమంగా టిప్పర్లతో మొరం తరలిస్తుండగా తిర్మన్‌పల్లి గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. భారీ లోడ్‌తో టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడంతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతుందన్నారు. తమ రోడ్డు గుండా భారీ లోడ్‌తో మొరంను తరలించవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

తాడ్వాయి: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మాజీవాడిలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షౌకత్‌అలీ, నరేందర్‌రెడ్డి, అఖిల్‌రావు, లక్ష్మణచారి, రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థినులకు అవగాహన

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛందం సంస్థ డివిజన్ మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎస్ రాణి బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పలు అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిన్నారులకు సువర్ణ ప్రాశన పంపిణీ

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌లో గోవనం ట్రస్టు ఆధ్వర్యంలో చిన్నారులకు సువర్ణ ప్రాశన చుక్కల మందులను ట్రస్టు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ శనివారం పంపిణీ చేశారు. ఈ సువర్ణ ప్రాశనతో చిన్నారులకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి శనివారం అందించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండాకు చెందిన సలావత్ రాజు ఇటీవల మాచారెడ్డి అంగడి బజార్‌లో ఫోన్ పోగొట్టుకోవడంతో ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం హంగర్గ గ్రామ పంచాయతీలోని వార్డుల వారిగా పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో గంగాధర్ శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడికి సన్మానం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు బీజేపీ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితుడైన నిట్టు రఘును సన్మానించి అభినందనలు తెలిపారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరిక వెంకటేశ్, బస్వాలింగం, రాజేందర్ రావు, వసంత్ రావు, సతీశ్, చంద్రమౌళి, రాంచంద్రం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయాలి

నాగిరెడ్డిపేట: పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు వాసుదేవరావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ప్రసాద్, కిష్టయ్య, అనురాధ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సామగ్రి అందజేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మోహన్‌రావు రూ. 27 వేలు విలువ చేసే మధ్యాహ్న భోజన సామగ్రిని హెచ్ఎం శ్రీనాథ్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తమ్మళి రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.